సాక్షి
వికారాబాద్
సోమవారం । 20 । ఫిబ్రవరి । 2023



ఇళ్లలోనే తెల్ల బంగారం

ధరల్లో హెచ్చు తగ్గుల కారణంగా పత్తి కొనుగోలుకు వ్యాపారులు ముందుకు రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 8లో▸



విధుల్లోకి భాషా పండితులు

మంత్రి సబితారెడ్డితో చర్చలు సఫలం కావడంతో 18 రోజులుగా సహాయనిరాకరణ చేపడుతున్న భాషాపండితులు విధుల్లో చేరారు. 8లో▸



జెండాతో బాలిక

పరిణయం.. రమణీయం

పార్వతీపరమేశ్వరుల కల్యాణం వైభవంగా జరిగింది. వికారాబాద్ మండలం పులుసుమామిడి సమీపంలోని పరమేశ్వరుల గుట్టపై ఆదివారం స్వామివార్లకు విశేష పూజలు నిర్వహించారు. శివపార్వతులను భక్తిశ్రద్ధలతో రథంపై ఊరేగించారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య కల్యాణం కనుల విందుగా జరిగింది. ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ పట్టు వస్త్రాలు సమర్పించారు. వేలాది మంది భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. – అనంతగిరి



శివపార్వతులకు కల్యాణశోభ



పులుసుమామిడి సమీపంలోని గుట్టపై పార్వతీపరమేశ్వరుల కల్యాణం



రథాన్ని లాగుతున్న భక్తులు

శివాజీ ఉత్సవం.. శోభాయమానం

ఛత్రపతి శివాజీ జయంతిని పురస్కరించుకుని వికారాబాద్‌లో శోభాయాత్ర ఘనంగా జరిగింది. ఆదివారం ఆలంపల్లి నుంచి వికారాబాద్ పట్టణంలోని ప్రధాన దారుల గుండా శోభాయాత్ర కొనసాగింది. వేలాదిమంది యువకులు ఇందులో పాల్గొన్నారు. హనుమాన్ మందిరం వద్ద మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, మాజీమంత్రి డాక్టర్ చంద్రశేఖర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సదానందరెడ్డి, ప్రజాప్రతినిధులు, ఆయా పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు. – అనంతగిరి



యువతతో కలిసి ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆనంద్



ర్యాలీలో నృత్యం చేస్తున్న బాలికలు, యువతులు

న్యూస్‌రీల్

రామలింగేశ్వరస్వామి సన్నిధిలో న్యాయమూర్తి



హైకోర్టు న్యాయమూర్తి దంపతులను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

పూడూరు: మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా మండల పరిధిలోని దామగుండం రామలింగేశ్వర స్వామిని హైకోర్టు న్యాయమూర్తి పి.మాధవిదేవి కుటుంబ సమేతంగా వచ్చి దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సన్మానించింది. అనంతరం సోమన్‌గుర్తిలో సమీప బంధువు, ఇటీవల మరణించిన నారాయణరెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశ్‌పటేల్, నాయకులు తదితరులు పల్గొన్నారు.

డిప్యూటీ తహసీల్దార్‌కు జాతీయ అవార్డు



అవార్డు పత్రాన్ని అందుకుంటున్న డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్

దోమ: డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న విజయేందర్ ఏపీజే అబ్దుల్ కలాం జాతీయ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్‌లో అవార్డు సెలక్షన్ కమిటీ చైర్మన్ నల్ల రాధాకృష్ణ నుంచి నియామక పత్రాన్ని అందుకున్నారు. అక్షరం, ఆరోగ్యం, ఆర్థికం అనే అంశాలపై గ్రామీణ ప్రాంతాల్లో విశేష సేవలను అందించినందుకుగాను ఈ అవార్డును ప్రకటించింది. వచ్చే నెల 12న తిరుపతిలో నిర్వహించే సమావేశానికి హాజరుకావాలన్నారు. సౌత్ ఇండియాలోనే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక, పుదుచ్చేరి రాష్ట్రాల నుంచి సుమారు 600 మంది డెలిగేట్స్ ఈ కాన్ఫరెన్స్‌కు హాజరవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో బీఎస్‌పి తెలంగాణ అధ్యక్షుడు గౌతం మల్లే, స్వేరో సర్కిల్ జిల్లా అధికార ప్రతినిధి ఏరన్‌పల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకం.. ఇదేం ఆటంకం



నాగసమందర్ నుంచి ప్రాజెక్టులోకి వెళ్లకుండా రోడ్డుపై తవ్విన కందకం



ప్రాజెక్టుకు వెళ్లే ప్రధాన రహదారిలో వేసిన కంచె

కోట్‌పల్లి ప్రాజెక్టు దారులన్నీ మూసివేత

- నెల రోజులుగా అనుమతి ఇవ్వని అధికారులు
- అయోమయంలో పర్యాటకులు

ధారూరు: కోట్‌పల్లి ప్రాజెక్టుకు వెళ్లేదారులన్నీ మూసివేశారు. సుమారు 30 రోజులు అవుతున్నా పునరుద్ధరణకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో పర్యాటకులు అయోమయానికి గురవుతున్నారు. ఇటీవలే పర్యాటక ప్రాంతంగా గుర్తింపు పొందుతున్న కోట్‌పల్లి ప్రాజెక్టుకు ఎవరూ రాకుండా చర్యలు చేపట్టడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిత్యం వేలాదిగా వచ్చే పర్యాటకులు దారి మూసి ఉండటం చూసి ఆశ్చర్యానికి గురవుతున్నారు. గత జనవరి నెల 16న పూడూరు మండలం మన్నెగూడకు చెందిన నలుగురు యువకులు ప్రాజెక్టు నీటిలో ఈత కొట్టందుకు వెళ్లి మృతి చెందిన విషయం విదితమే. ఇదిలా ఉంటే అంతకు ముందు ప్రాజెక్టు నీటిలో షికారు చేసేందుకు బోటు ఇవ్వడంలో జాప్యం చేశారన్న అక్కసుతో ఓ ఫారెస్టు అధికారి కొన్నాళ్లు ప్రాజెక్టుకు వెళ్లే దారిని మూసివేశారు. ఇలా ఎప్పుడు పడితే అప్పుడు, ఎవరు పడితే వారు దారిని మూసేస్తే ఎలా అని పర్యాటకులు ప్రశ్నిస్తున్నారు. ప్రాజెక్టుకు వెళ్లే దారి ఫారెస్టు వారిది కాదని అంటున్నారు. ప్రాజెక్టు నిర్మాణానికి ముందు ఆర్ అండ్ బీ శాఖ పరిధిలో కోట్‌పల్లి మండల కేంద్రానికి వెళ్లే దారి అని, తర్వాత ప్రాజెక్టు నిర్మాణం పూర్తి అయ్యాక ఇరిగేషన్‌శాఖ పరిధిలోని మారిందని, ఈ రోడ్డును ఎలా మూసివేస్తారని వివిధ ప్రాంతాల నుంచి ఆదివారం ప్రాజెక్టుకు వచ్చిన పర్యాటకులు నిలదీశారు. ఫారెస్టు అధికారులు రోడ్డు మూసేయడంతో ఇరిగేషన్ అధికారులు కూడా విస్మయానికి గురయ్యారు. ప్రాజెక్టుకు మేము వెళ్లడానికి సైతం దారి లేదని అంటున్నారు. ఫారెస్టు అధికారులు దారిని ఎలా మూసేస్తారని సంబంధిత అధికారి ఒకరు ప్రశ్నించారు. ప్రాజెక్టుకు వెళ్లే దారిని మూసేయడానికి అధికారం ఎక్కడిదని ఆయన ప్రశ్నించారు. కాయకింగ్ వారు నిర్వహిస్తున్న బోటింగ్‌ను ప్రాజెక్టు పరిధిలో మరో చోటుకు మార్చేసి పర్యాటకులను అక్కడికే రప్పించుకుంటున్నారు. ఇందుకోసం ప్రాజెక్టుకు వచ్చే పర్యాటకులకు రూట్‌మ్యాప్‌ను చూపిస్తున్నారు. ప్రాజెక్టుకు వెళ్లే ప్రధాన రహదారిని ఫారెస్టు అధికారులు మూసేయడంపై సర్వత్రా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ప్రాజెక్టుకు వెళ్లే ప్రతి వాహనం నుంచి చెక్‌పోస్టు వద్ద నిర్ణీత రుసుం వసూలు చేస్తున్నారని, వాహనాలను ఫారెస్టు భూమిలో నిలుపుతున్నందున రుసుం చెల్లిస్తున్నామని వారు వివరించారు. ప్రాజెక్టు ఇరిగేషన్ పరిధిలోనిది అయితే శాంతి భద్రతల పర్యవేక్షణ పోలీసుశాఖదని వారు పేర్కొన్నారు.

త్వరలో కలెక్టర్‌తో సమావేశం



పర్యాటకులను అనుమతించే విషయపై కలెక్టర్ సమక్షంలో త్వరలో ఫారెస్టు, ఇరిగేషన్, రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులతో సమావేశం జరుగుతుంది. ప్రాజెక్టు నీటిలో పడి ఎవరైనా మృతి చెందితే ఎవరిది బాధ్యత అనే అంశంపై సందిగ్ధం నెలకొంది. ఇటీవల నలుగురు యువకులు నీటిలో మునిగి మృతిచెందారు. ఇలాంటి ఘటనే మళ్లీ పునరావృతం కాకూడదన్న ఉద్దేశంతోనే నాగసమందర్ వైపు నుంచి ప్రాజెక్టుకు రావడానికి వీలులేకుండా రోడ్డుకు అడ్డంగా కందకం తవ్వించాం.

– రాజేందర్‌రెడ్డి, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్

మరో మహానందిగా తీర్చిదిద్దుతా



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి, పలువురు నాయకులు

- లొంక బసవన్న ఆలయాభివృద్ధికి కృషి
- ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

కొడంగల్: మండల పరిధిలోని కస్తూరుపల్లి శివారులో ఉన్న లొంక బసవన్న ఆలయాన్ని మరో మహానంది క్షేత్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆలయాన్ని ఆయన సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. పరిసరాల్లో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ఆలయాన్ని పర్యాటక కేంద్రంగా మార్చేందుకు కృషి చేస్తానన్నారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించి సమస్యలు పరిష్కరిస్తానని అన్నారు. లొంక బసవన్న ఆలయంలోని నంది నోటి నుంచి నిరంతరం నీరు వస్తూ ఉంటుందన్నారు. ఎంతో ప్రాశస్త్యం ఉన్న పురాతన ఆలయంగా పేరుగాంచిందన్నారు. అనంతరం కోనేరులో ఉన్న నంది విగ్రహానికి పూజలు చేశారు. నంది నోటి నుంచి వస్తున్న నీరు ఎంతో పవిత్రమైనదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, మున్సిపల్ కౌన్సిలర్ మధుయాదవ్, పీఏసీఎస్ చైర్మన్ శివకుమార్ గుప్తా, నారాయణపేట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్యాసం రామకృష్ణ, మాజీ జెడ్పీటీసీ బాల్‌సింగ్‌నాయక్, భీములు, బాకారం అరుణ్, మల్లయ్య, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నివాళి తారకరత్న పార్థివ దేహానికి పలువురు సినీ, రాజకీయ రంగ ప్రముఖులు నివాళి అర్పించారు. నివాళి అర్పించిన వారిలో ఎమ్మెల్యే కాలె యాదయ్య ఉన్నారు.

దడపుట్టిస్తున్న ధన్నారం బ్రిడ్జి



అధ్వానస్థితికి చేరుకున్న ధన్నారం బ్రిడ్జి

వికారాబాద్ మున్సిపల్ పరిధి ధన్నారం రోడ్డులో ఉన్న బ్రిడ్జి ప్రమాదకరంగా మారింది. వాగుపై చాలా ఏళ్ల క్రితం వంతెన నిర్మించారు. రెండు వైపులా ఉన్న సిమెంట్ దిమ్మెలు విరిగిపోయాయి. ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా వాహనదారులు ప్రమాదం బారిన పడే అవకాశం ఉంది. ఈ రోడ్డులో ప్రయాణించే వాహనాల సంఖ్య పెరగడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనన్న ఆందోళన నెలకొంది. ఎలాంటి ప్రమాదం జరగకముందే మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు. – వికారాబాద్ అర్బన్



జిమ్నాస్టిక్స్.. అదుర్స్

తెలంగాణ జిమ్నాస్టిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్న సీఎం కోహినూర్ కప్ ఇంటర్నేషనల్ రిథమిక్ జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్–2023 పోటీలు ఆద్యంతం అలరించాయి.

పాముకాటుతో వస్తే పట్టించుకోరా?

- పీహెచ్‌సీ వైద్యులపై ఎంపీపీ కరుణ ఆగ్రహం
- ఫోన్‌లో కలెక్టర్‌కు, డీఎంహెచ్‌ఓకు ఫిర్యాదు



చికిత్స పొందుతున్న నితిన్‌కుమార్



వైద్యులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎంపీపీ కరుణ

బషీరాబాద్: 'పాము కాటుతో ఆస్పత్రికి వస్తే బాధితుడికి వైద్యం ఎందుకు చేయలేదు? కనీసం స్నేక్‌బైట్ విరుగుడుకు ఇంజక్షన్ కూడా ఇవ్వలేదు? జనం ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రికి వస్తే పట్టించుకోరా? కనీసం ప్రాథమిక వైద్యం కూడా చేయకుండా ప్రాణాలు పోతుంటే చూస్తూ ఉంటారా? ఇలాగైతే మీరెందుకు..' అంటూ ఎంపీపీ కరుణ బషీరాబాద్ పీహెచ్‌సీ వైద్యులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు రోజుల కిందట మండల కేంద్రానికి చెందిన నితిన్‌కుమార్(17) పాము కాటుకు గురయ్యాడు. వైద్యం కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్తే వైద్యం చేయకుండా నిర్లక్ష్యం చేయడంతో 108లో తాండూరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. అయితే పరిస్థితి విషమంగా ఉండడంతో కుటుంబీకులు వికారాబాద్ తరలించి అక్కడ ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. వెంటిలేటర్‌పై ఉన్న ఆ యువకుడి పరిస్థితి అత్యంత విషమంగా ఉందని ఎంపీపీ కరుణ తెలిపారు. ఆస్పత్రికి వచ్చినప్పుడు ఇంజక్షన్ వేసి ఉంటే ఈ రోజు ఆ యువకుడు నయం అయ్యేవాడని అన్నారు. ఆ రోజు విధుల్లో ఉన్న అధికారిని సస్పెండ్ చేయాలని జిల్లా కలెక్టర్‌కు, డీఎంహెచ్‌ఓకు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతమైతే కఠిన చర్యలు తీసుకుంటామని మెడికల్ అధికారికి హెచ్చరించారు. ఎంపీపీతో పాటు గ్రామ సర్పంచ్ ప్రియాంక, బీఆర్‌ఎస్ యువజన నాయకులు శ్రావణ్ కుమార్, అనూప్ ప్రసాద్, రియాజ్, నరసింహులు, నరేష్, ఇసాక్, ధనరాజ్ సంతోష్, లక్ష్మీకాంత్ ఉన్నారు.

కానరాని మొక్కలు.. రికార్డుల్లో లెక్కలు

- ధన్నారం రోడ్డులో అవెన్యూ ప్లాంటేషన్ ఏదీ?
- రూ.3.70లక్షలు వెచ్చించిన అధికారులు
- గ్రీన్ బడ్జెట్ పేరుతో నిధుల స్వాహా
- కలెక్టర్ తనిఖీ చేయాలంటున్న స్థానికులు



ధన్నారం రోడ్డులో నేలవాలిన మొక్కలు

వికారాబాద్ అర్బన్: హరితహారం కార్యక్రమంలో మొక్కలు నాటడం ఏమోకానీ కొందరు మున్సిపల్ అధికారులకు మాత్రం జేబులు నింపుతున్నాయని మాత్రం చెప్పవచ్చు. గ్రీన్ బడ్జెట్ పేరుతో అందినకాడికి నిధులు కాజేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని ధన్నారం రోడ్డులో మల్టీలెవల్ అవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా మొక్కలు కొనుగోలు చేసేందుకు రూ. 3.70లక్షలు ఖర్చు చేశారు. విచిత్రం ఏమిటంటే రైల్వేస్టేషన్ వెనుకాల ఉన్న ఆటో చౌరస్తా నుంచి 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న ధన్నారం వరకు ఎక్కడా మల్టీలెవల్ అవెన్యూ ప్లాంటేషన్ జరగలేదు. ఇది కేవలం అధికారులు రికార్డుల్లో మాత్రమే రాసుకొని డబ్బులు తీసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ధన్నారం తండా సమీపంలో రోడ్డుకు ఇరు వైపులా కొన్ని మొక్కలు నాటినా వాటికి ఇప్పటి వరకు ట్రీ గార్డ్‌లు ఏర్పాటు చేయడం, సపోర్టుగా కట్టెలు కట్టడం చేయలేదు. హరితహారం ముగిసి మూడు, నాలుగు నెలలు కావస్తున్నా అక్కడక్కడా నాటిన మొక్కలకు ఒక్కసారి కూడా నీరు పోయలేదనే విమర్శలు ఉన్నాయి. హరితహారం పేరుతో ఇంత పెద్ద మొత్తంలో అవినీతి జరుగుతున్నా గతంలో ఉన్న అధికారులు పట్టించుకోలేదనే అపవాదు ఉంది. ప్రస్తుత జిల్లా కలెక్టరైనా గ్రీన్ బడ్జెట్ ఖర్చుపై ఆరా తీసి నిజాని నిగ్గుతేల్చాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. అవసరమైతే అధికారులు అవెన్యూ ప్లాంటేషన్ ఎక్కడ నిర్వహించారో తనిఖీ చేస్తే డొల్లతనం బయటపడే అవకాశం ఉంది. అధికారులు, ప్రజా ప్రతినిధులు ఎప్పుడూ తిరిగే హైదరాబాద్ రోడ్డు, కలెక్టర్ కార్యాలయం రోడ్డులోనే మొక్కలను సంరక్షిస్తూ మసిపూసి మారెడికాయ చేసే ప్రయత్నం చేస్తున్నారనే విమర్శ ఉంది. గ్రీన్ బడ్జెట్ ఖర్చుపై సామాన్య ప్రజలు కూడా ముక్కున వేలేసుకుంటున్నారు.

క్లుప్తంగా

మాజీ సర్పంచ్‌కు ఉత్తమ సేవా అవార్డు


మాజీ సర్పంచ్‌ పెంటయ్య

పూడూరు: సామాజిక సేవలకు గాను పూడూరు మండలం తిర్మలాపూర్‌ మాజీ సర్పంచ్‌ పెంటయ్య జాతీయ స్థాయిలో బెస్ట్‌ సర్వీస్‌ అవార్డుకు ఎంపికయ్యారు. ఆదివారం అవార్డు సెలక్షన్‌ కమిటీ జాతీయ అధ్యక్షుడు రాధాకృష్ణ చేతుల మీదుగా ఆహ్వాన పత్రికను అందుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్య, ఆరోగ్యం, ఆర్థిక రంగాల్లో విశేష సేవలు అందించినందుకు అవార్డుకు ఎంపికయ్యారని తెలిపారు. బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ప్రతి ఏటా అవార్డులను అందిస్తున్నట్లు తెలిపారు. మార్చి 12న తిరుపతిలో జరిగే సమావేశంలో ఈ అవార్డును అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్‌ పెంటయ్య మాట్లాడుతూ అవార్డు రావడం మరింత బాధ్యతను పెంచిందన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్‌

హయత్‌నగర్‌: ఇంట్లో గుట్టుగా పేకాట ఆడుతున్న ఆరుగురిని పోలీసులు అరెస్ట్‌ చేసిన సంఘటన శనివారం రాత్రి హయత్‌నగర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. పెద్దఅంబర్‌పేట్‌లోని ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతున్న పిల్లి రమేష్‌, దేశారం బాలకృష్ణ, దండెం రామచంద్రారెడ్డి, ఇటికల అంజిరెడ్డి, బుయ్య జ్ఞానేశ్వర్‌, బుయ్య మహేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 19,020 నగదు, 6 సెల్‌ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

గృహిణి అదృశ్యం

పహాడీషరీఫ్‌: కుమార్తెతో కలిసి గృహిణి అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీరాం కాలనీకి చెందిన గీతాదేవి కోల్‌(27), బినోద్‌ దంపతులు. వీరికి ఇద్దరు పిల్లలు. ఈ నెల 13న బినోద్‌ డ్యూటీకి వెళ్లి రాత్రి వచ్చి చూడగా భార్య, కుమార్తె శివానీ కోల్‌(5) కనిపించలేదు. ఫోన్‌ కూడా స్విచ్ఛాఫ్‌ చేసి ఉండడంతో వస్త్రాలు, కొంత నగదు కూడా కనిపించలేదు. వారి ఆచూకీ కోసం పలు ప్రాంతాల్లో వెతికినా ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు పహాడీషరీఫ్‌ పోలీస్‌స్టేషన్‌, లేదా, సెల్‌ నంబర్‌ 94906 17241లో సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

వ్యక్తి మృతదేహం లభ్యం

ఇబ్రహీంపట్నం: స్థానిక పెద్ద చెరువులో గల్లంతైన వ్యక్తి మృతదేహం ఆదివారం లభ్యమైంది. ఎస్‌ఐ మారయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పరిగూడ గ్రామానికి చెందిన నరాల మహేందర్‌(52) అదే గ్రామ పట్నం పెద్ద చెరువు బ్యాక్‌ వాటర్‌లో స్నానం చేసేందుకు దిగాడు. ప్రమాదవశాత్తు నీటి మునిగిపోయాడు. గల్లంతైన మహేందర్‌ కోసం డీఆర్‌ఎఫ్‌ బృందం వెతికినా ప్రయోజనం లేకపోయింది. తిరిగి ఆదివారం ఉదయం గాలించగా మృతదేహం లభ్యమైయింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బీఆర్‌ఎస్‌ పాలనలో అభివృద్ధి శూన్యం


సమావేశంలో మాట్లాడుతున్న వీరేందర్‌గౌడ్‌

తుక్కుగూడ: బీఆర్‌ఎస్‌ పాలనలో అభివృద్ధి శూన్యమని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తూళ్ల వీరేందర్‌గౌడ్‌ ఆరోపించారు. ఆదివారం మున్సిపల్‌ పరిధిలోని దేవేందర్‌నగర్‌ కాలనీలో ప్రజాగోస బీజేపీ భరోసా కార్యక్రమాని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్‌ పార్టీ అవినీతిలో కూరుకుపోయిందని, కుటుంబ పాలన సాగుతోందని ఆరోపించారు. ఎనిమిదేళ్ల పాలనలో ప్రభుత్వం చేసిందేమీ లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ జెండా ఎగరడం ఖాయమన్నారు. ఇందు కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మున్సిపల్‌ అధ్యక్షుడు రచ్చ లక్ష్మణ్‌, మున్సిపల్‌ చైర్మన్‌ కే మధుమోహన్‌, కౌన్సిలర్లు బీ యాదగిరిరెడ్డి, రాజమౌని రాజు, నాయకులు రాజు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లల్లోనే తెల్ల బంగారం

- మూడు నెలలుగా మగ్గుతోందని ఆవేదన
- సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతుల వినతి


ఎన్కేపల్లిలో రైతు ఇంట్లో నిల్వ చేసిన పత్తి

మోమిన్‌పేట: ధరల్లో హెచ్చు తగ్గుల కారణంగా పత్తి కొనుగోలుకు వ్యాపారులు ముందుకు రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పత్తి తీత పూర్తయి మూడు నెలలు కావస్తున్నా ఇంకా ఇళ్లలోనే ఉందని తెలిపారు. దీంతో శరీరంపై దురదలు వస్తున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి సంవత్సరం నవంబరు చివరి వారంలోనే పత్తి క్రయ, విక్రయాలు జోరందుకునేవని, ఫిబ్రవరి చివరి వారం వచ్చినా వ్యాపారులు రావడం లేదన్నారు. సీసీఐ అధికారులు మార్కెట్‌ ధరకు అనుకూలంగా పత్తి దిగుబడిని కొనుగోలు చేయాలని రైతులు డిమాండు చేస్తున్నారు. పెట్టుబడి కోసం తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొనుగోలు సీజన్‌ ప్రారంభానికి ముందు మార్కెట్‌ ధరలు ఎగువన ఉండగా సీజన్‌ వచ్చేసరికి ధరలు తగ్గడం ఆందోళన కలిగిస్తోందని అంటున్నారు. మార్కెట్‌లో స్థిరీకరణ లేకపోవడం వల్ల వ్యాపారులు సిండికేట్‌గా మారి ధరలు తగ్గించారని రైతులు ఆరోపిస్తున్నారు. జిల్లాలో పత్తి విక్రయించడానికి ప్రత్యేక మార్కెట్లు లేకపోవడంతో దళారులను ఆశ్రయించాల్సి వస్తోందని రైతులు అంటున్నారు. దళారులు చెప్పిన ధరలకే తెల్ల బంగారాన్ని విక్రయించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పత్తి తీసిన కూలీలకు డబ్బులు ఇవ్వాల్సి ఉందని. పంట దిగుబడి అమ్మితే కానా వారికి డబ్బు ఇచ్చే పరిస్థితి లేదన్నారు. సకాలంలో పత్తి విక్రయించకుంటే మళ్లీ అప్పులు చేయాల్సిన ఉంటుందని పలువురు రైతులు తెలిపారు.

అధిక విస్తీర్ణంలో సాగు

గత సంవత్సరం తెల్ల బంగారానికి ప్రభుత్వ మద్దతు ధర కంటే రెట్టింపు పలికింది. జనవరి తర్వాత అమ్ముకున్న రైతులు అధిక లాభాలు పొందారు. మొక్కజొన్న సాగుకు అడవి పందుల బెడద ఎక్కువగా ఉండడంతో రైతులు పత్తి సాగు వైపు మొగ్గు చూపారు. దీంతో మండలంలో 80శాతం మేర రైతులు పత్తి పంటను సాగు చేశారు. అతివృష్టి వల్ల పంట దిగుబడిలో సగం కూడా రాలేదని రైతులు తెలిపారు. కొనుగోలు సీజన్‌ ప్రారంభం కాక ముందు క్వింటాలు పత్తి రూ. 9,600 వరకు ధర పలకింది. కానీ పంట చేతికి వచ్చే సమయానికి ధరలు తగ్గడంతో రైతులకు మింగుడు పడడం లేదు. మిల్లులో క్వింటాలు పత్తికి గరిష్టంగా రూ.7800 పలుకుతోంది.

ఆరు ఎకరాల్లో పత్తి సాగు



రెండు ఎకరాలు కౌలుకు తీసుకొని, నాకున్న నాలుగు ఎకరాలతో కలిపి ఆరు ఎకరాల్లో పత్తి పంట సాగు చేశా. ఇప్పటి వరకు పంట సాగుకు రూ. 1.30లక్షలు పెట్టుబడి పెట్టా. అతివృష్టి వల్ల దిగుబడి అమాంతం పడిపోయింది. కేవలం 32 క్వింటాళ్లు మాత్రమే దిగుబడి వచ్చింది. అమ్ముదామంటే వ్యాపారులు రావడం లేదు. వారు వచ్చే వరకు ఆగాల్సిందే. సీసీఐ అధికారులు మార్కెట్‌ ధరకు పంటను కొనుగోలు చేయాలి.

– నర్సింలు, పత్తి రైతు, ఎన్కేపల్లి

పేదల పార్టీ కాంగ్రెస్‌

డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి

కుల్కచర్ల: నిరుపేదలకు వెన్నుదన్నుగా నిలిచేది ఒక్క కాంగ్రెస్‌ పార్టీ మాత్రమేనని డీసీసీ అధ్యక్షుడు టీ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని అనంతసాగర్‌లో కాంగ్రెస్‌ పార్టీ కార్యకర్తలకు డిజిటల్‌ సభ్యత్వ కార్డులు, ఇన్సూరెన్స్‌ కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనాదిగా పేదలకు తోడు నీడగా నిలిచేది కాంగ్రెస్‌ ఒక్కటేనని పేర్కొన్నారు. నాడు గిరిజనులకు భూములు, నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చింది కాంగ్రెస్‌ పార్టీయేయని అన్నారు. చెంచుల సంక్షేమానికి ఎన్నో పథకాలు అమలు చేశామని, కానీ బీఆర్‌ఎస్‌ పాలనలో వారు ఇబ్బందికర జీవనాన్ని అనుభవిస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి చెంచు కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని, మూడు ఎకరాల భూమిని కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాటకు కట్టుబడేది కాంగ్రెస్‌ పార్టీ మాత్రమేనని స్పష్టం చేశారు. త్వరలో ఇంటింటికి కాంగ్రెస్‌ పార్టీ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరినీ కలుస్తామని తెలిపారు. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం చెప్పే మాటలకు చేస్తున్న పనులకు పొంతన లేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన రుణమాఫీ హామీ ఐదు సంవత్సరాలు కావస్తున్నా అమలు కాలేదని ఆరోపించారు. పేద ప్రజలు బాగుపడాలంటే కాంగ్రెస్‌ పార్టీ అధికారంలోకి రావాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి, అనంతసాగర్‌ గ్రామ కమిటీ అధ్యక్షుడు మహేశ్‌, నాయకులు నగేష్‌, హన్మంతు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


కార్యకర్తలకు డిజిటల్‌ సభ్యత్వ కార్డులు అందజేస్తున్న రామ్మోహన్‌రెడ్డి

కల్యాణం.. కమనీయం


శివపార్వతుల కల్యాణ వేడుకలో పాల్గొన్న భక్తజనం

- భూకైలాస్‌ ఆలయంలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు
- అలరించిన కర్ణాటక నృత్యాలు
- పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు

తాండూరు రూరల్‌: మండలంలోని అంతారం తండాలో కొలువుదీరిన భూకైలాస్‌ ఆలయంలో మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ నెల15నుంచి 20వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఆదివారం శివపార్వతుల కల్యాణం కమనీయంగా సాగింది. అంతకుముందు శివపార్వతులను పల్లకీలో ప్రతిష్ఠించి ఊరేగింపు నిర్వహించారు. కర్ణాటక వాసుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. తండా పెద్దలు శంకర్‌నాయక్‌, నరేందర్‌ చౌహాన్‌ దంపతులు కల్యాణాన్ని జరిపించారు. ఈ వేడుకలో వివిధ జిల్లాల భక్తులు పాల్గొన్నారు. ఆదివారం తెల్లవారు జమున నిర్వహించిన అగ్నిగుండంలో ఆలయ వ్యవస్థాపకులు వాసు పవార్‌ నాయక్‌ తదితరులు పాల్గొన్నారు.

భక్తి మార్గాన్ని ఎంచుకోవాలి

ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి


పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి: ప్రతి ఒక్కరూ భక్తి మార్గాన్ని ఎంచుకోవాలని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి సూచించారు. మండలంలోని సయ్యాద్‌పల్లిలో శివపార్వతుల కల్యాణ మహోత్సవంలో పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలందరూ క్షేమంగా ఉండాలని స్వామి వారిని కోరుకున్నట్లు తెలిపారు. ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అరవింద్‌ రావు, జెడ్పీటీసీ హరిప్రియ, సర్పంచ్‌ రామకృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్‌ వెంకటయ్య నాయకులు ప్రవీణ్‌రెడ్డి, హన్మంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విధుల్లోకి భాషా పండితులు

- మంత్రి సబితారెడ్డితో చర్చలు
- సానుకూల ప్రకటనతో పాఠశాలలకు..
- 18 రోజులపాటు బోధనకు దూరం
- నష్టపోయిన విద్యార్థులు
- ప్రత్యేక తరగతులు నిర్వహించాలని తల్లిదండ్రుల వినతి


భాషా పండితులతో మాట్లాడుతున్న మంత్రి సబితారెడ్డి

తాండూరు: ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల ప్రక్రియలో తమకూ అవకాశం కల్పించాలని డిమాండ్‌ చేస్తూ భాషా పండితులు 18 రోజుల పాటు తరగతులను బహిష్కరించిన విషయం తెలిసిందే. ఈ నెల 1వ తేదీ నుంచి చేపట్టిన సహాయ నిరాకరణలో భాగంగా పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టారు. వార్షిక పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో భాషా పండితులు చేపట్టిన నిరసన వల్ల విద్యార్థులపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉండడంతో విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి చర్చలు జరిపారు. చర్చలు సానుకూలంగా సాగడంతో నిరసన కార్యక్రమాన్ని విరమిస్తున్నట్లు ప్రకటించారు. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో భాషా పాఠ్యాంశాలపై విద్యార్థులకు పట్టు లేదు. తెలుగు, హిందీ సబ్జెక్టులు చదవడం, రాయడం రాని విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో ఉన్నారనేది విద్యాశాఖ అధికారులు సైతం అంగీకరిస్తున్నారు. గతంలో జరిగిన పదో తరగతి పరీక్షల్లో అధిక సంఖ్యలో భాషా సబ్జెక్టుల్లోనే ఫెయిల్‌ అవ్వడం గమనార్హం. భాషా పండితుల సమస్య పరిష్కారం అయినా ఎమ్మెల్సీ ఎన్నికలతో ఉపాధ్యాయ వర్గాలు ఎన్నికల హడావుడిలో ఉన్నారు. దీంతో పదో తరగతి పరీక్షలపై ఉత్తీర్ణత శాతంపై తీవ్ర ప్రభావం చూపుతోందంటూ విద్యావంతుల నుంచి విమర్శలు వస్తున్నారు. జిల్లాలో 1,032 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. అందులో ప్రాథమికోన్నత పాఠశాలలు 116, ఉన్నత పాఠశాలలు 174 ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో 323 మంది తెలుగు, హిందీ, ఉర్దూ భాషా ఉపాధ్యాయులు బోధన చేస్తున్నారు. అయితే రెండు నెలల క్రితం ప్రభుత్వం ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించడంతో పాటు, బదిలీల ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. అందులో భాషా పండితులకు అవకాశం కల్పించలేదు. దీంతో నెల రోజులుగా తమ డిమాండ్లను ప్రభుత్వానికి చెబుతూ వస్తున్నారు. అందులో భాగంగా విద్యాశాఖ మంత్రికి, విద్యాశాఖ ఉన్నతాధికారులకు, జిల్లా కలెక్టర్లు, ఎమ్మెల్యేలకు వినతి పత్రాలు ఇస్తూ వచ్చారు. అయితే ప్రభుత్వం పదోన్నతులపై స్పష్టత రాకపోవడంతో ఈ నెల 1వ తేదీ నుంచి భాషా పండితులు, పీఈటీలు బోధన చేయడం బహిష్కరించారు. రోజులు గడుస్తున్నా ప్రభుత్వం భరోసా కల్పించలేదు. మరో వైపు ప్రభుత్వం భాషా పండితులు విధుల్లో చేరాలంటూ కఠినంగా హెచ్చరిస్తూ వస్తోంది. అయినా వారు మాత్రం తగ్గకపోవడంతో పలు జిల్లాల్లో వారిని సస్పెండ్‌ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో శనివారం భాషా పండితుల సంఘం ప్రతినిధులు మంత్రి సబితారెడ్డితో చర్చలు జరిపారు. చర్చలు సఫలం కావడంతో బోధన ప్రారంభిస్తామని ప్రకటించారు. అయితే 18రోజుల పాటు బోధన జరగకపోవడంతో విద్యార్థులకు నష్టం జరిగింది. నష్ట నివారణ కోసం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. జిల్లాలో గతంలో జరిగిన 10వ తరగతి వార్షిక పరీక్షల్లో తెలుగు, హిందీ, ఉర్దూ సబ్జెక్టుల్లో చాలా మంది విద్యార్థులు ఫెయిల్‌ అయ్యారు. కోవిడ్‌ కారణంగా భాషపై విద్యార్థులు పట్టు సాధించ లేదు. ఇప్పటికీ తెలుగు, హిందీ భాషల్లో అనర్గళంగా చదవలేక పోతున్నారనే విమర్శలు ఉన్నాయి. పరీక్షల వేళ భాషా పండితులు 18 రోజులుగా విధులకు దూరంగా ఉన్నారు. జిల్లాలో మొత్తం భాషా పండితులు 323 మంది ఉండగా అందులో తెలుగు సబ్జెక్టుకు 157 మంది, హిందీ సబ్జెక్టు బోధనకు 152 మంది, ఉర్దూ టీచర్లు 14 మంది ఉన్నారు. విద్యార్థుల బోధనపై ప్రత్యేక దృష్టి సారిస్తారా .. లేదా అనేది ప్రశ్నార్థకంగా మారింది.

విద్యార్థుల కోసమే నిరసన విరమించాం



గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని భాషా పండిత పరిత్‌ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసనను విరమించాం. నేటి నుంచి పాఠశాలలకు వస్తాం. పదో తరగతి పరీక్షలకు విద్యార్థులను సమాయాత్తం చేస్తాం. అవసరమైన ప్రత్యేక తరగతులు నిర్వహిస్తాం.

– వెంకటేశ్వర్లు, భాషా పండిత పరిషత్‌ జిల్లా అధ్యక్షుడు

నేత్రపర్వంగా పార్వతి పరమేశ్వరుల కల్యాణం

- ఉత్సాహంగా రథోత్సవం
- భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం
- జీవన్గీలో కొనసాగుతున్న ఉత్సవాలు
- నేడు అంతర్రాష్ట్ర కుస్తీ పోటీలు


అగ్నిగుండ మహోత్సవాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్‌ సునీతారెడ్డి


విద్యుత్‌ దీపాలతో జీవన్గీ మహాదేవ లింగేశ్వర ఆలయం

బషీరాబాద్‌: జిల్లాలోని ప్రముఖ శైవ క్షేత్రం జీవన్గీ మహాదేవ లింగేశ్వర జాతర అట్టహాసంగా కొనసాగుతోంది. ఆదివారం సాయంత్రం కల్యాణ మండపంలో పార్వతి పరమేశ్వరుల కల్యాణోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. భారీగా తరలివచ్చిన భక్తుల సమక్షంలో జంగమయ్యలు కల్యాణం జరిపించారు. తెల్లవారుజామున ఆలయ పరిసరాల్లో అగ్నిగుండం మహోత్సవం నిర్వహించారు. జెడ్పీ చైర్‌పర్సన్‌ పట్నం సునీతారెడ్డి కర్రలకు నిప్పు పెట్టి అగ్నగుండ మహోత్సవాన్ని ప్రారంభించారు. వందలాది మంది భక్తులు నిప్పుల మీద నడిచారు. ఈ సారి నదిలో నీళ్లు ఉన్నందున ఎడ్ల బండ్ల పోటీలు నిర్వహించ లేదు. రాత్రి భక్తుల కోలాహలం మధ్య స్వామి వారి రథోత్సవం వైభవంగా జరిగింది. జాతరకు వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ అన్నదానం చేసింది.

నేడు అంతర్రాష్ట్ర కుస్తీ పోటీలు

కాగ్నా నది తీరంలో సోమవారం అంతర్రాష్ట్ర కుస్తీ పోటీలు జరగనున్నాయి. జిల్లాకు చెందిన కుస్తీ వీరులతో పాటు కర్ణాటక ప్రాంతం నుంచి వందల మంది క్రీడీకారులు రానున్నారు. ఉదయం 8గంటలకు పోటీలు ప్రారంభం కానున్నాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఇందుకు కాగ్నా నది వద్ద ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ పోటీలు తిలకించేందుకు మహిళలకు అనుమతి లేదని ఆలయ కమిటీ తెలిపింది. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బషీరాబాద్‌ ఎస్‌ఐ విద్యాచరణ్‌రెడ్డి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

బెట్టింగ్‌కు బానిసై యువకుడి ఆత్మహత్య

- ఇక బతకలేను..
- అమ్మానాన్నలను బాగా చూసుకోవాలంటూ తమ్ముడికి వాట్సాప్‌ మెసేజ్‌


రాజశేఖర్‌ (ఫైల్‌)

పహాడీషరీఫ్‌: ఆన్‌లైన్‌ బెట్టింగ్‌లకు బానిసైన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన పహాడీషరీఫ్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై సీ వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మామిడిపల్లికి చెందిన చుక్క చంద్రయ్యకు ముగ్గురు కుమారులు. పెద్ద కుమారుడు రాజశేఖర్‌(26) శంషాబాద్‌ విమానాశ్రయంలో ప్రైవేట్‌ ఉద్యోగం చేస్తున్నాడు. ఇతను ఆన్‌లైన్‌ బెట్టింగ్‌లకు బానిసయ్యాడు. ఈ క్రమంలో తల్లి బంగారాన్ని తాకట్టు పెట్టాడు. ఈ నెల 18న బంగారం గురించి తల్లి అడిగింది. తీసుకరావడానికి కొంత సమయం పడుతుందని చెప్పి రాత్రి డ్యూటీకి వెళ్లా డు. ఆదివారం తెల్లవారుజామున 2.44 గంటల ప్రాంతంలో తమ్ముడు పవన్‌కు వాట్సాప్‌ మెసేజ్‌ పంపాడు. ''శంషాబాద్‌ పాత పోలీస్‌ స్టేషన్‌ వెనుక ఉన్న బంగారం దుకాణంలో రూ. 40 వేలకు అమ్మ నగలు తాకట్టు పెట్టాను.. ఇందుకు సంబంధి ంచిన రసీదు తన ఫోన్‌ పౌచ్‌లో ఉంది.. నా కారణంగా అమ్మ నాన్నలు బాధ పడుతున్నారని.. బెట్టింగ్‌లకు బానిసయ్యాను.. వారిని మంచిగా చూసుకో.. నేను చనిపోతున్నాను'' అని మెసేజ్‌ పంపాడు. తెల్లవారుజామున పవన్‌ పాలు పితకడానికి పొలం వద్దకు వెళ్లాడు. అక్కడ చెట్టుకు వేళాడుతూ రాజశేఖర్‌ విగతజీవిగా కనిపించాడు. ఈ విషయా న్ని కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

దాతల సహకారం అభినందనీయం

చేవెళ్ల: ఆలయ అభివృద్ధికి దాతల సహకారం మరువలేనిదని ఆలయ పూజారి శ్రీకాంత్‌ అన్నారు. మండలకేంద్రంలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వర ఆలయ అభివృద్ధికి ఆదివారం మల్లారెడ్డిగూడ అనుబంధ గ్రామమైన ఎర్రోని కొటాల గ్రామానికి చెందిన మూడిమ్యాల పీఏసీఎస్‌ వైస్‌ చైర్మన్‌ ఎర్ర మల్లేశ్‌ రూ.50వేల విరాళాన్ని పూజారి శ్రీకాంత్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలకేంద్రంలోని లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయం ఎంతో పురాతనమైనదని ఇక్కడ భక్తుల కోరికలు తీర్చే రెండవ తిరుపతిగా ప్రసిద్ధి చెందిందన్నారు. భక్తులు, దాతలు అందించే సహాయ సహకారంతో ఆలయాన్ని దినాదినాభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. దేవాలయాలు ప్రజల మానసిక ప్రశాంతతకు, ఒత్తిడిని దూరం చేసేందుకు ఎంతో దోహదం చేస్తాయని చెప్పారు.

రాజరాజేశ్వర సేవలో భక్తజనం

మహేశ్వరం: శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో మూడో రోజు ఆదివారం ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించారు. ఉదయం మంగళ గౌరీశ్వరుడు, మల్లీశ్వరుడు, అఘోరేశ్వరుడు, కాశీపతీశ్వరుడు, గంగాధరేశ్వరుడు, ఇష్టకామేశ్వరుడు, ముక్తేశ్వరుడు, ఏకాంబరేశ్వరుడు, అమరావతీశ్వరుడు, హరిహరేశ్వరుడు, అమరేశ్వరుడు, మణికర్ణికేశ్వరుడు, మహానందీశ్వరుడులకు అభిషేకం, హారతీ, కుంకుమార్చన, మంత్ర పుష్పం, పుష్పాలంకరణ, మంగళ హారతి నిర్వహించారు. శనివారం రాత్రి బీఆర్‌ఎస్‌ రాష్ట్ర యువ నాయకుడు పట్లోళ్ల కార్తీర్‌రెడ్డి ఆర్థిక సౌజన్యంతో నిర్వహించిన జబర్దస్త్‌ ఫేం నిర్వహించిన కార్యక్రమాలు అలరించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ చైర్మన్‌ నిమ్మగూడెం సుధీర్‌ గౌడ్‌ చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ డైరెక్టర్లు కె. చంద్రయ్య, పి.యాదమ్మ, కె.మహేందర్‌, బాల్‌రాజ్‌, వెంకటేష్‌, ఈట మురళీకృష్ణ పాల్గొన్నారు. రాష్ట్ర సివిల్‌ సప్‌లై కార్పొరేషన్‌ చైర్మన్‌ రవీందర్‌ సింగ్‌ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ మండల కార్మిక విభాగం అధ్యక్షుడు సంజయ్‌ దేశ్‌ముఖ్‌ పాల్గొన్నారు. అనంతరం డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి పూజలు నిర్వహించారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని వేడుకున్నట్లు తెలిపారు. అంతకుముందు ఆలయ కమిటీ చైర్మన్‌ నిమ్మగూడెం సుధీర్‌ గౌడ్‌, డైరెక్టర్లు చల్లా నర్సింహారెడ్డిని ఘనంగా సన్మానించి ఫొటోను అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ పార్టీ మండల అధ్యక్షుడు కాకి ఈశ్వర్‌, మీర్‌పేట్‌ కార్పొరేటర్‌ చల్లా బాల్‌రెడ్డి, ఎస్సీ సెల్‌ నియోజకవర్గ అధ్యక్షుడు నందిగామ నర్సింహ, నేతలు రాజు, బాల్‌రాజ్‌, కొమరయ్య, కుమార్‌, చంద్రమోహన్‌, యాదయ్య, రమేష్‌ పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తూళ్ల వీరేందర్‌ గౌడ్‌ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మహేశ్వరం ఎంపీటీసీ పోతర్ల సుదర్శన్‌ యాదవ్‌, సిరిగిరిపురం సర్పంచ్‌ కాసుల సురేష్‌ పాల్గొన్నారు. మండలంలోని ఘట్టుపల్లి వీరాంజనేయ స్వామి ఆలయంలో శివరాత్రి సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ట్రస్టీలు రఘుమారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్‌ అనితారెడ్డి, పీఏసీఎస్‌ డైరెక్టర్‌ రాకేష్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీశైలం, ఆలయ అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.


శివగంగ రాజరాజేశ్వర ఆలయం